## భట్టిప్రోలు కథలు

సలగాల నాగేసు శ్రీరామ అచ్చమ్మ ఇంటి దగ్గరికి వెళ్ళేటప్పటికి తడికేసుంది. ఇంటి ముందున్న వేప చెట్టు కింద తాటి నారతో పలుపుతాడు పేనుతున్నాడు మురుగేసు.
"ఇంత పొద్దున్నే తడికేసి యాడికెళ్ళిందిరా అచ్చమ్మ?" అడిగాడు నాగేసు, మురుగేసుని.
"ఇంత పొద్దున్నే అచ్చమ్మత్తతో నీకేంటి పనిరా నాగేసూ?" అన్నాడు మురుగేసు బీడీకోసం జేబులు తడుముకుంటూ. ఇదిగోనంటూ ఒక బావుటా బీడీ కూర్చున్న మురుగేసు మీద విసిరేసి, ఇంకోటి నోట్లో పెట్టుకొని పొయ్యిలో కాలుతున్న చింత పుల్లతో బీడీ ముట్టించుకొని కాలుతున్న బీడీ ముక్కను మురుగేసుకిచ్చాడు నాగేసు. ఇద్దరి బీడీలు అంటుకున్నాయి.

# నత్తముక్కల గోంగూర

### డాక్టర్ నక్కా విజయరామరాజు

"అచ్చమ్మత్తతో ఏం పనిరా?" అడిగాడు దమ్ములాగి మురుగేసు మళ్ళీ.

"సుబ్బయ్య బాయ్య ఇంటికి తుమ్మల నుంచి చుట్టాలొచ్చారు. ఆళ్ళకి అచ్చమ్మత్త వండే నత్తముక్కల కూర తినాలని చాన్నాళ్ళుంచి ఉందంటా. మాపిటేలకు గుంటూరు ఎళ్ళిపోతారంటా. బేగీ రమ్మని చెప్పి పంపింది తిరుపతమ్మ- ఇదిగో అల్లం, కారం మంచినూనె, లవంగాలు, చెక్క" అంటూ సీసాలో మంచినూనె, కాగితం పొట్లంలో కట్టిన మసాలా దినుసులు, గోంగూర కట్టలు చూపించాడు.

"మట్టి సట్టిల కోసం కుమ్మర కాంతయ్య ఇంటికి. ఎళ్తానని ఎళ్ళిందిప్పుడే, వచ్చుద్దిలే కూసోరా" అంటూ ముచ్చట్లు పెట్టబోయాడు మురుగేసు.

"ఇక్కడ కూకుని నీతో ఊసులాడుతుంటే నా వీపు విమానం మోత మోగిత్తాడు మా బాయ్య- మాచెర్ల చెరువు కట్ట మీదకెళ్ళి జీవాల కోటయ్య దగ్గర ఏట మాంసం తేవాల. ఆలస్యంగా ఎళ్తే ముక్క మిగలదు. అచ్చమ్మ అత్త వత్తే..నత్తముక్కల గోంగూర వండమని సుబ్బయ్య బాయ్య పంపాడని చెప్పు" అంటూ వచ్చినంత వేగంగా మాచెర్ల చెరువుకట్ట వైపు వెళ్ళిపోయాడు సలగాల నాగేసు. ఇంకో బీడీ అడుగుదామంటే మారు మాట్లాడకుండా ఎళ్ళిపోయాడే అనుకుంటూ సగం పేనిన తాడు చేతిలోకి తీసుకున్నాడు మురుగేసు.

***

ఇంటి తడక తీస్తూ "ఈ దినుసులు, గోంగూర ఎవురివిరా..మురుగేసు?" అడిగింది అచ్చమ్మ.

"ఆ.. చెప్పడం మరచానత్తో..తుమ్మల నుంచి చుట్టాలొచ్చారంటా.. నత్తముక్కల గోంగూర వండమని తిరుపతమ్మ పెద్దమ్మ పంపింది నాగేసుతో" అన్నాడు.

ఇంటిముందు చూరు కిందున్న తట్టలో ఉన్న నత్తల్ని నేలమీద గుమ్మరించి లిక్కితో(పచ్చగడ్డి కోసే కొడవలి) నత్తల్ని కొట్టి ముక్క తీసి సట్టిలో వేసుకుంటోంది అచ్చమ్మ. పొద్దుపొడవక ముందే పున్నీళ్ళ బువ్వ తిని బాపయ్య కట్టెల అడితిలో కట్టెలు కొట్టడానికి గొడ్డలి భుజానేసుకుని వెళ్ళిపోయాడు అచ్చమ్మ మొగుడు రాముడు. పొద్దువాలాక గాని రాడు.

పెద్దారం, కనగాల, గూడవల్లిలో ఆమె ముగ్గురు కొడుకులు ముగ్గురు ఆసాముల దగ్గర జీతాలకు కుదురుకున్నారు. తిండి, బట్ట అన్నీ వాళ్ళే చూసుకుంటారు. పక్క పక్క ఊళ్ళోనే ఉన్నా పండగలకి, పబ్బాలగ్గాని రారువాళ్ళు.

"సాంబశివుడా నీదు మహిమా నాకు తెలియకనున్నది. పంచభూతాలైదు పట్టి పట్టి ఆడిస్తున్నవి" అంటూ కూనిరాగం తీస్తూ నత్తలు కొడుతోంది అచ్చమ్మ.

కర్ర టకటక చప్పుడు చేసుకుంటూ వచ్చి నిలబెట్టిన నులక మంచం వాల్చుకుని వేపచెట్టు కింద కూర్చున్నాడు పెద్దారం దాసు.

"ఏంది పెద్దయ్యా.. ఏదో పనిబడి వచ్చావే?" అడిగింది పాట ఆపి నత్తలు కొడుతూనే అచ్చమ్మ.

"పాటాపకు పాడమ్మా..యాడ నేర్చుకున్నావో గాని మా బాగుందీ పాట. నువ్వు పాడినట్టు ఆడి మహిమే అర్థం గావడం లేదు" అన్నడు దిగులుగా.

నత్తలు కొట్టడం ఆపేసి "ఏమైంది పెద్దయ్యా? ఎప్పుడూ ఆడి పాడి అందర్ని నవ్వించేటోడివి, ఇప్పుడేమయింది. పెద్దమ్మకు జ్వరం ఇంకా తగ్గలేదా ఏంది?" అంది అచ్చమ్మ.

"అది చెప్పడానికేనమ్మా వచ్చా.. మీ పెద్దమ్మ పది రోజుల్నుంచి మంచంలో పొలుగులా పడుంది. ఎర్రాచారి మాత్రలైపోయాయి. నల్లాచారి గారి ఇంజక్షన్లు ఏత్తా ఉన్నా గునంలేదు. ఏమి తింటం లేదు. మొన్న చేపల సుబ్బయ్య పిచ్చికల గుంటలో పట్టిన బురద జెల్లల కూర వండిన వాసన చూల్లేదు. నిన్న జీవాల కోటయ్య ఏట తలకాయ



మాంసం, ఇంగురు కూర వండినా కన్నెత్తి చూడలేదు. ఏమన్నా అంటే నోరు బాగాలేదంట. ఆ డాక్టర్లేమో లోనకేమన్నా పోతేనే గందా మందులు పనిచేసేది అంటున్నారు'' అన్నాడు దిగులుగా పెద్దారం దాసు చుట్ట నుసి రాలుస్తూ.

''దానికేం భాగ్గెం.. ఇదిగో ఇప్పుడు కొట్టే నత్తలు సుబ్బయ్య మామ ఇంటికొచ్చిన చుట్టాల కోసం. లింగయ్య గారి చెరువులోనో, యానాదుల దిబ్బ కిందో ఓ పది నత్తలేరి పెద్దమ్మకు కూర వండి తీసుకొత్తా నువ్వెళ్ళు పెద్దయ్య'' అంది అచ్చమ్మ.

***

నత్త ముక్కలతో అచ్చమ్మ వండే కూరంటే ఊళ్ళో వాళ్ళకే కాదు చుట్టపక్కల ఊరు వాళ్ళకీ ఎంతో ఇష్టం. ఇంటికి చుట్టాలొస్తే కోడి మాంసం, వేటమాంసం, చేపలు వద్దు.. అచ్చమ్మ వండిన నత్తముక్కల గోంగూర కావాలని అడిగేవారు. కొత్త అల్లుళ్ళు కూడా.. అచ్చమ్మ వండే నత్తముక్కల కూరంటే గుటకలు వేస్తూ తినేవాళ్ళు.

***

రేపల్లె సుబ్బయ్య రెండో కూతురు సంతోషాన్ని తెనాలిలో టాక్సీలు బాడుగకు తోలే రమేష్‌కిచ్చి చేశాడు. తెనాలి తీసుకెళ్ళమంటే అద్దెలు ఎక్కువ. పల్లెటూరోళ్ళకి ఆడుంటే కష్టమని ఇక్కడే ఉంచాడు సంతోషాన్ని. వారానికోసారొచ్చి రెండ్రోజులుండి వెళ్ళేవాడు రమేష్. బుర్రిపాలెంలో చుట్టాల పెళ్ళి కెళ్ళొస్తూ చుట్టాలతో కలిసి రాజ్యం టాకీసులో 'దసరా బుల్లోడు' సినిమాకెళ్ళింది సంతోషం. రమేష్ ఎవరో అమ్మాయితో కలిసి సినిమాలో కూర్చుండటం చూసింది. వాళ్ళిద్దరిని లేపి రచ్చ రచ్చ చేసింది. ఆ పిల్ల జుట్టు పట్టుకొని నాలుగు తన్నింది. పక్కనున్న చుట్టాలు సర్దిచెప్పి ఇంటికి తీసుకొచ్చారు సంతోషాన్ని. ఆ రోజు నుంచి ఆ తెనాలి టాక్సీలు తోలేవాడితో కాపురం చేయనని తెగేసి చెప్పేసింది.

పదిహేను రోజుల తర్వాత టాక్సీ తోలుకొచ్చాడు రమేష్ రేపల్లెకు ఏదో కిరాయి తగిలి. ఇంటికొస్తే చివాట్లు పెట్టి, నోరు పట్టని మాటలని ఇంట్లోకి రానియ్య లేదు సంతోషం. అమ్మానాన్నలు ఎంత సర్ది చెప్పినా ససేమిరా ఆడితో కాపురం చేయనంది. మొగుడు పెళ్ళాలకు మాటమాటా పెరిగింది. కోపంలో పంట పొలాల్లో తెగుళ్ళకు కొట్టడానికి తెచ్చిన ఎండ్రిన్ తాగేశాడు రమేష్ పెళ్ళాన్ని బెదిరిద్దామని. పల్లె జనమంతా నిమిషంలో అక్కడ గుమిగూడారు. ''ఎవురన్నా పోయి నల్లాచారిని పిలుచుకురండ్రా'' అని ఊరి పెద్ద పర్రె బసవయ్య అంటే కుర్రోళ్ళు ఆయన్ని సైకిలు మీద తీసుకొచ్చారు. ''ఇది ఎండ్రిన్ తాగిన కేసు.. నాతో కాదు'' అని సైకిల్ తొక్కుకుంటూ వెళ్ళి పోయాడు ఆయన.

''రేపల్లెగానీ, చెరుకుపల్లి గానీ తీసుకెళ్ళండ్రా లేకపోతే ఆడు బతకడు. ఈడికేమన్నా అయితే తెనాలి గంగానమ్మపేటంతా మనూరు మీద పడుద్ది'' అన్నాడు ఊరు పెద్ద. కుర్రోళ్ళు అబ్రహం రిక్షా కోసం వెళ్తే బాడుగకి కనగాల పోయాడని తిరిగొచ్చారు. ఏం చేయాలో తోచక నులకమంచం

వెల్లకిలా వేసి దానిమీద రమేష్‌ను పడుకోబెట్టి నలుగురు కుర్రోళ్ళు దాన్ని భుజాలమీద ఎత్తుకుని చేలకడ్డం పడి చెరుకుపల్లిలో అప్పుడే కట్టిన కొత్తాసుపత్రికి తీసుకెళ్ళారు. అప్పటికే నోటివెంట నురుగు రాసాగింది.

''ఇది పాయిజన్ కేసు..నమ్మకం లేదు..అయినా నా ప్రయత్నం నేను చేస్తా. మందులకు, సెలైన్ బుడ్లకు కలిపి రెండు వేలవుద్ది'' అన్నాడు డాక్టర్. కుర్రోళ్ళ జేబుల్లో టీలకు, బీడీలకు తప్ప పైసా లేదు. ''మా పెద్దోళ్ళు ఎనకే వస్తున్నారు, వాళ్ళు వచ్చి డబ్బు కడతారు. ముందు ఎండ్రిన్ కక్కించండి డాక్టర్ గారు, లేకపోతే ఆడు సచ్చిపోతాడు'' అని ఎంత బతిమిలాడినా లోనికెళ్ళిన డాక్టర్ బయటికి రాలేదు. ''ఇక్కడి నుంచి తీసుకెళ్ళండి. మా హాస్పిటల్లో ఛస్తే మాకు చెడ్డ పేరొస్తది'' అని కంపౌండర్ వాళ్ళని బయటికి గెంటేశాడు.

''గుంటూరు గవర్నమెంట్ ఆసుపత్రికి తీసుకెళ్ళండి'' అని ఉచిత సలహా పారేశాడు అక్కడున్న వాచ్‌మెన్. కుర్రోళ్ళకు ఏం చేయాలో తోచలేదు. వాడు చస్తే తమ మీదికి వస్తుందని తిరిగి ఇంటికి తీసుకొచ్చారు. రమేష్‌కు ఎక్కిళ్ళు మొదలయి, నోటి వెంట సొంగ, నురుగు దారాపాతంగా కారుతోంది., దబ్బపండుగా ఉండే మనిషి నీలం రంగుకి మారసాగాడు. పల్లె జనమంతా రమేష్ మంచం చుట్టూ మూగారు. రమేష్ అత్త, మామ, పెళ్ళాం సంతోషం నెత్తినోరు బాదుకుంటూ గోల గోలగా ఏడవసాగారు.

అప్పుడే పొలం నుంచి నత్తలు ఏరుకొస్తున్న అచ్చమ్మ అక్కడ చేరిన గుంపును చూసి ఏమైందని అడిగింది. ''రేపల్లె గంగయ్య అల్లుడు తెనాలి రమేష్ ఎండ్రిన్ తాగాడు'' అంటూ జరిగిందంతా చెప్పింది కొట్లో భాగ్యం ఏడుస్తూ. అక్కడే తట్టలోని నత్తలు నేలమీద గుమ్మరించి కొడవలి తీసి నత్తలు కొట్టసాగింది. నత్తముక్కలు కింద పారేసి సొన అంతా గిన్నెలో పట్టింది. గుంపులో ఉన్న దోనె నాగమ్మను పిలిచి కుంకుడు కాయలు తెమ్మంది. ఈ లోపు నాగమ్మ కుంకుడుకాయలు తెచ్చి కొట్టి బొచ్చెలో నానేసి, కుంకుడు కాయల్ని పిసికి రసం తీసింది. దాన్ని నత్తముక్కల సొన ఉన్న గిన్నెలో పోసింది.

''అక్కడ మనిషి చావు బతుకుల్లో కొట్టు కుంటుంటే నత్తలు కొట్టుకోవడానికి జాగా ఇక్కడే దొరికిందా ఈ అచ్చమ్మకి?'' అంటూ తిట్టుకోసాగారు కొంతమంది ఆడోళ్ళు.

''ముందు ఇక్కడున్న వాళ్ళంతా తప్పుకోండి'' అంటూ జనాన్ని పక్కకు నెట్టింది అచ్చమ్మ. రమేష్ తలను పైకెత్తి పట్టుకోమంది. అతనికి గిన్నెలో ఉన్న నత్తముక్కల సొన, కుంకుడుకాయ రసాన్ని తాగించింది. తాగడానికి ముందు గిన్నె నెట్టేసినా బలవంతంగా తాగించింది. మొత్తం తాగితేనే బతుకుతావు, లేకుంటే సచ్చిపోతావు అంటూ భయపెట్టింది. రమేష్‌కు కూడా కొంత ఆశ కలిగినట్టుంది. గటగట గిన్నెడు రసాన్ని తాగేశాడు. ఆ తర్వాత కక్కుకోవడం మొదలెట్టి కడుపులోని పేగులు నత్తలు బయట కొచ్చేంతగా కక్కుకున్నాడు. ఈలోపు ఇంకా కొన్ని నత్తలు కొట్టి సొన తీసింది. రమేష్ మొత్తం కక్కు కున్నాక ఇంకో గిన్నె నత్తల సొన తాగించింది. అదికూడా కక్కుకున్నాడు. గంటకు తేరుకుని, ఇంకో గంటకు మెల్లగా మాట్లాడటం మొదలెట్టాడు రమేష్. అప్పటిదాకా గుమిగూడిన జనం ఎవరిళ్ళకు వారు వెళ్ళిపోయారు.

''సచ్చిపోతాడని ఆశ వదిలేసిన మనిషిని బతికించింది. అచ్చమ్మ అసాధ్యురాలే'' అని పొగిడాడు ఊరి పెద్ద పర్రె బసవయ్య. సంతోషం అయితే అచ్చమ్మ కాళ్ళ మీద పడి ఏడుస్తూ గంటదాకా వదల్లేదు. ''ఆడ్ని ఏమీ అనను..దేనితో తిరిగినా ఫర్వా లేదు. ఆడు బతికితే చాలు అత్తా'' అంటూ పొగిలి పొగిలి ఏడ్చింది. చావు కబుర్లు చెప్పడానికి బయలుదేరిన కుర్రోళ్ళ సైకిళ్ళు ఆగిపోయాయి.

***

ఖాళీ తట్టను, కొడవలిని తీసుకొని ఇంటి కొచ్చింది అచ్చమ్మ. అప్పటికే దీపాలు వెలిగించి చాలా సేపయ్యింది. ఎప్పుడొచ్చాడో రాముడు.. నులక మంచానికి అడ్డంగా సోలిపోయాడు. పొద్దుననంగా తినెళ్ళిన సద్దన్నం తొందర తొందరగా ఉడికేస్తే ఓ ముద్దన్నా తింటాడని ఆదరాబాదరాగా పొయ్యి రాజేసి అరసోలెడు బియ్యం ఎసట్లో వేసింది. తొందరగా ఉడకాలని పుల్లల్ని ఎగదోస్తోంది. ఎండు పుల్లలు సురసుర కాలుతున్నాయి.

''రేపల్లె గంగయ్య అల్లుడికి ఎట్టా వుంది?'' మంచంలో నుండే రాములు అడిగాడు.

''దేవుడి దయ వల్ల చావు తప్పినట్టే'' చెప్పింది పొయ్యిలో పుల్లలు ఎగదోస్తూ అచ్చమ్మ.

''టయానికి అత్త రాబట్టి ఆడు బతికాడు.. లేకుంటే ఈ పాటికి సమాధుల దొడ్లో కాల్తా వుండేవాడు. ఇంకాసేపు ఆగితే పోలీసు కేసయ్యేది'' అన్నాడు బీడీ దమ్ము లాగుతూ రాముడు పక్కనే కూర్చున్న మురుగేసు.

''ఊరు ఊరంతా నీ గురించే చెప్పు కుంటున్నారత్తా. నత్తల సొనతో చచ్చినోన్ని బతికించావని'' అన్నాడు మళ్ళీ ఇంకో బీడీ రామయ్యకి అందిస్తూ మురుగేసు. అచ్చమ్మ ఏమీ మాట్లాడకుండా మట్టి తెడ్డుతో అన్నం కలిపి మెతుకులు తీసి అన్నం ఉడికిందో లేదో చూస్తోంది. కుండలో ఉడుకుతున్న గంజిని రెండు సత్తు గిన్నెల్లో పోసి బువ్వేసి.. అంత ఉప్పు గల్లేసి ఇద్దరికి చెరో చేతికి ఇచ్చి పొయ్యిలో చురుచుర కాల్సిన కుక్కసావడాయిల్ని ఇద్దరికి ఇచ్చింది. గంజన్నం తింటూ కుక్క సావడాయిలు నంజుకుంటున్నారు ఇద్దరు. కుక్కసావయిడాలు భలేగున్నాయి అన్నాడు రామయ్య. ''అత్త చేతుల్లోనే ఉంది మామ అంతా'' అంటూ ఆత్రంగా గంజి తాగుతున్నాడు మురుగేసు. గిన్నెలో గంజి సగం ఖాళీ అయిన తర్వాత ''ఇంకో సావడాయి ఉంటే ఇయ్యత్తా ఏడి గంజిలో నంజుకుంటుంటే నా సామిరంగా భలే రంజుగా ఉందని'' పొయ్యి దగ్గరున్న అచ్చమ్మను అడిగాడు మురుగేసు. చెరొకటి కాల్చి ఇచ్చింది అచ్చమ్మ. గిన్నెలో గంజంతా అయిపోయిన తర్వాత చెంబులో నీళ్ళతో నోరు పుక్కిలించి ఊసి చెయ్యి కడుక్కున్నాడు మురుగేసు. మంచం దిగి చెయ్యి కడుక్కోవడానికి చెంబు తీసుకొని కుడితిగాబు దగ్గరికెళ్ళాడు రాములు.

ఇద్దరూ బీడీలు ముట్టించుకున్నాక, పొంత కుండలోని వేడి నీళ్ళు బకెట్లో తోడుకొని ఇంటెనకాలకు వెళ్ళింది అచ్చమ్మ.

అచ్చమ్మ తిని, ఇల్లు సర్దుకుని రాములు మంచం దగ్గరికొచ్చి కూర్చుంది. పుచ్చపువ్వులా వెన్నెల కాస్తోంది. డొంకపర్తి దీనమ్మ ఇంటిముందున్న ఖాళీస్థలంలో పిల్లలు పిల్లి వచ్చే ఎలుక కేర్ అని కొంతమంది..చెరపట్టీల ఆటలు కొంత మంది ఆడు కుంటున్నారు.

''అత్తా! మొత్తానికి సంతోషం కాపురం నిలబెట్టావ్'' అంటూ మళ్ళీ మొదలుపెట్టాడు మురుగేసు బీడీ దమ్ము లాగుతూ.

''నాకు తెలియక అడుగుతా..నత్త సొనకు అంత పవరేడిదత్తా?'' అన్నాడు.

''నాకేం తెలుసురా..పాపం ఆ కుర్రోడి పేణాలు ఎటూ పోతాయ్ అంటున్నాడు గందా, సిన్నప్పుడు మా జేజి చెప్పేది. నత్తముక్కలు అమృతంతో సమానమని, పాండు రోగం, నంజురోగం వచ్చినోళ్ళకి నత్తముక్కలతో గోంగూర ఏసి వండి నెల రోజులపాటు పెడితే భీముడిలా అవుతారని, పాలుపడని బాలింతలకు నత్తముక్కల కూర తినిపిత్తే బాగా పాలుపడి ఆ పిల్లోడు ఆవిరికుడులా అవుతాడని..నత్తముక్కల్లో గొబ్బరేసి గాని, పచ్చి పప్పేసిగాని వండితే రైయ్‌కట్టని పిల్లలు, సమర్తాడని ఆడపిల్లలకు గాని పెడితే నంజు గింజు పోయి రంజుగా తయారవుతారని చెప్పేది. మనకు దాళ్వా వచ్చినప్పటి నుంచి కుప్పలుతెప్పలుగా ఈ ఎండ్రిన్ పెరారుర్‌లకు పాములు, పీతలు, చేపలే, కప్పలు, పక్షులు సచ్చిపోతున్నాయి. మరి ఒక్క నత్తైనా సచ్చిందా? లేదు. అందుకే ఈ నత్తసొన సచ్చేవాడికి ఉపకారం చెయ్యదా అని అప్పటికి ఆ బుద్ధిపుట్టి ఏదో చేశా. ఇంతకీ ఆడి ఆయుష్షు గట్టిది. సంతోషమ్మ తాళిబొట్టు నికార్సయ్యింది'' అంది తాను చేసిందేమీ లేదు అన్నట్టు అచ్చమ్మ.

ఎప్పట్నించో అచ్చమ్మ ఇంటిపేరు మరిచిపోయారు జనం. అందరు నత్తల అచ్చమ్మ అనే పిలుస్తారు. గుడ్డి అచ్చమ్మ, పడమటి అచ్చమ్మ, తోకల అచ్చమ్మ దీనికి కొంత కారణం.నలుగురున్న చోట అచ్చమ్మ అంటే అందరూ ఒక్కసారి పలికేవారు. అందుకే గుర్తు కోసం జనం నత్తల అచ్చమ్మ అని పిలిచేవారు. ఆ తర్వాతర్వాత అది ఆమె ఇంటి పేరైపోయింది.

నులక మంచంలో పడుకొని ఆకాశంలో చుక్కలు చూస్తున్నాడు రాముడు.'' నీ చేత్తో వండిన నత్తముక్కల గోంగూర అంటే పడిసచ్చే జనానికి కూడా ఒక్కొక్కప్పుడు ఒక్కొక్క రకంగా వండుతావు ఎందుకత్తా.. నువ్వు ఎట్టా వండినా బాగానే ఉంటదే?'' అని ఇంకో బీడీ ముట్టిస్తూ అడిగాడు మురుగేసు.

''నత్తముక్కలకూ ఎప్పుడూ ఒకలాగా రుచి, పసి ఉండదురా, ఎండాకాలం దొరికే నత్తల్లో ఎండుకొబ్బరి కూసింత చెక్క, రెండు లవంగాలు దంచేసి గుజ్జుగా వండితేనే రుచి. అప్పుడు గోంగూర ఏత్తే బాగోదు. వానకాలంలో వరి చేలు

కలుపులు తీసేప్పుడు దొరికే నత్తలకి గొంగూర ఏసి వండితే బాగుంటుంది, అప్పుడు నీసు ఎక్కువ అందుకని'' అంది.

''పగలు మాటలు పనికి చేటు..రాత్రి మాటలు నిద్రచేటు అన్నట్టు కూరల సంగతి నీకెందుకురా.. ఆడంగి నాయాల. రేపు నీ పెళ్ళాం వచ్చినాక చెప్పుద్దులే'' అన్నాడు నక్షత్రాలు లెక్కిస్తున్న రాముడు చిరాకుగా.

మారు మాట్లాడకుండా లేచి వెళ్ళిపోయాడు మురుగేసు. వెన్నెల్లో పక్కబట్టలు సరిజేసింది అచ్చమ్మ.



***

దీపాలు పెట్టేవేళ పెద్దారం నుంచి దాసరి కోటేసు వచ్చాడు. నులక మంచం మీద పడుకుని బీడీ కాలుస్తున్నాడు రాముడు. పొయ్యి రాజేస్తోంది అచ్చమ్మ.

''ఏందయ్యా! ఈ ఏల ఇప్పుడు వచ్చావు?'' అడిగింది అచ్చమ్మ కోటేసుని చూసి.

''పెద్దమ్మకి వచ్చే పేణం.. పోయే పేణంగా ఉంది, చెప్పి రమ్మన్నాడు దాసు పెద్దయ్య'' అని చెప్పి మిగతా వాళ్ళకి చెప్పడానికి వెళ్ళిపోయాడు కోటేసు.

''అయ్యో మొన్ననంగా ఆ పెద్దయ్య సెప్పిపోయాడు నత్తముక్కల గోంగూర పెద్దమ్మ అడిగిందని, పనిలోబడి నాకామాటే గుర్తులేదు. ఇప్పుడెట్టాగా?'' అంది అచ్చమ్మ.

''ఎళ్దాం పదా..సివరి సూపైనా దక్కుద్దేమో'' అన్నాడు మంచం మీదనుంచి లేస్తూ రాముడు.

''ఉత్త చేతుల్లో ఎళ్తె ఏం బాగుంటది.. ఇప్పు డెట్టాగబ్బా?'' ఆలోచనలో పడింది అచ్చమ్మ.

''ఏమయ్యో నువ్వు ముందెళ్ళి పెద్దమ్మతో సెప్పు నేను నత్తముక్కల కూర వండి తీసుకొస్తున్నానని'' అంటూ తొందర చేసి పెద్దారం పంపింది అచ్చమ్మ.

పరుగుపరుగున లింగయ్య గారి చెరువుకట్ట మీదకెళ్ళింది అచ్చమ్మ. అపుడే కొద్దికొద్దిగా బయట కొస్తున్నాడు చంద్రుడు. చెరువులో దిగి పుడగసాగింది. తామరాకుల కింద, తూటికాడ ఆకుల మధ్య ఉన్న నత్తలు పదిదాకా దొరికినాయి. యానాదుల దిబ్బ మీదుగా వస్తుంటే షావుకారి పిచ్చయ్య గారి పంట కాలువ గట్టున ఏపుగా పెరిగిన గోంగూర మొక్కలు కనబడ్డాయి. వంటకి సరిపడనంత గోంగూర దూసింది. ఉరుకులు పరుగుల మీద ఇంటికి చేరి నత్తలు కొట్టి గోంగూర వేసి కూర వండింది. అప్పటికే చంద్రుడు పూర్తిగా బయటికొచ్చాడు. వండిన అన్నం గిన్నె అట్టాగే వుంది. దాన్నో చేత్తో , కూర సట్టి ఒక చేత్తో తీసుకొని చేలకడ్డాలపడి మొడుగు మెట్ట దాటి దార్లో పురుగు పుట్ర చూసుకోకుండా పెద్దారం చేరింది. అప్పటికే ఆదిమ్మ మంచం బయటపెట్టి ఏడుస్తున్నారు కూతుళ్ళు, మనవరాళ్ళు, చుట్టాలు. ఊరి జనమంతా మంచం చుట్టూ మాగారు. పెద్దారం దాసు ఎదురొచ్చాడు.''పొద్దునొచ్చినా కూసింత ఎంగిలి పడేదేమోనమ్మా మీ పెద్దమ్మ'' అంతా అయిపోయింది అన్నట్టు కళ్ళనీళ్ళు తుడుచుకున్నాడు.

దాసు భార్య ఆదిమ్మ పడుకున్న మంచం దగ్గరికి వచ్చిన అచ్చమ్మకు అక్కడున్న జనమంతా తప్పుకుని చోటిచ్చారు. అన్నం గిన్నె, కూర సట్టే కింద పెట్టింది. ''పెద్దమ్మా'' అంటూ పలకరించింది అచ్చమ్మ. ఆదిమ్మకు కంటిచూపేగాని నోటిమాట లేదు.

కంచం తెమ్మని సైగచేసింది అచ్చమ్మ. ఆ పక్కనే గొనేసుకున్న ఓ పిల్ల చిటికెలో తెచ్చిచ్చింది. దాంట్లో అన్నం, నత్తముక్కల గోంగూర కలుపుతుంది అచ్చమ్మ మంచం పక్కనే కూర్చుని.

''దీనికేమన్నా పిచ్చా.. ఇప్పుడో, కాసేపటికో పోయే మనిషికి ముద్దలు కలిపి పెట్టుద్దా'' అన్నట్టు చూస్తున్నారు కొంతమంది ఆడోళ్ళు. మిగిలిన కొంతమంది ఏడుస్తున్నారు. ముద్ద కలిపి ఆదిమ్మ నోటి దగ్గరికి తీసుకెళ్ళింది అచ్చమ్మ. ''నీకు ఇష్టమైన నత్తముక్కల గోంగూర వండి తెచ్చా పెద్దమ్మ..లే.. అచ్చమ్మని.. నత్తల అచ్చమ్మని'' అని పిలిచింది పెద్దగా. ఆదిమ్మలో కొంచెం కదలిక మొదలైంది. మంచం పట్టెమీద కూర్చున్న అచ్చమ్మ, ఆదిమ్మను లేపి ఇంకో మనిషి ఆసరాతో కూర్చోబెట్టింది. ఆమెలో చలనం వచ్చింది. నోటికందించిన ముద్ద కష్టంగా మింగింది. పొలమారింది. మెల్లగా నీళ్ళు తాపించి గొంతు సాపు చేస్తూ రుద్దింది అచ్చమ్మ. ముద్ద తర్వాత అయిదు ముద్దల దాకా మింగింది. అరగ్లాసు మంచి నీళ్ళు తాగింది ఆదిమ్మ. ఏడుపులు ఆగిపోయినయ్. దూరంగా చెట్టుకింద చుట్ట కాల్చుకుంటున్న దాసు పరుగెత్తుకుంటూ మంచం దగ్గరికి వచ్చాడు. ఆ రాత్రి ఆదిమ్మ దగ్గరే ఉంది అచ్చమ్మ. తెల్లారికి ఎవరి పనుల్లోకి వారు వెళ్ళిపోయారు. ఆదిమ్మ లేచి కూర్చుంది.

''ఇక పెద్దమ్మకి ఏ ఢోకా లేదులే పెద్దయ్య. నేను పోయి వత్తా'' అంటూ ఇంటికి చేరింది అచ్చమ్మ.

***

అచ్చమ్మ ముగ్గురు పిల్లలకు పెళ్ళిళ్ళు అయిపోయినయ్. మనమలు, మనుమరాళ్ళను చూసింది.

నిజాంపట్నం, అడవుదీవి, సింగుపాలెం, తుమ్మల చుట్టుపక్కన చేలన్నింటిని చేపల చెరువులు చేసేశారు. ఇపుడు చేపలకు బలమైన ఫీడు నత్తముక్కలే. ఊర్లోకి వారానికో లారీ వస్తుంది. పెద్ద డబ్బాకి యాభై రూపాయలు, చిన్న డబ్బాకి ముప్పై రూపాయలు చొప్పున నత్తలు కొనుక్కెళ్తున్నారు. కనగాల గంగానమ్మా చెరువు, రేగడ లింగయ్య గారి చెరువు, పల్లపు పొలాలు, పిచ్చుకల గుంట, బాడవ, మర్రివాగు, పొలాల్లో నత్తలు కనబడితే చాలు ఏరుకెళ్ళి చేపల ఫీడుకని అమ్మేసుకుంటున్నారు జనం. ప్రభుత్వం నత్తల్ని పట్టకూడదు, అమ్మకూడదు అన్నాక గిరాకీ పెరిగి అవి ఇప్పుడు మరీ అపురూపం అయిపోయాయి. ఇప్పుడు నత్తలూ లేవు..నత్త ముక్కల కూరొండే అచ్చమ్మా లేదు. ఏమైపోయినయ్యో!

★